జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్



PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 32 ॥ బుధవారం ॥ 1-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-




రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకం తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం శిల్పకళా వేదికలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో విడుదల చేశారు. తొలి విడతగా 41.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ చేస్తున్నట్లు ప్రకటించారు.

- హైదరాబాద్, జూన్ 30

# రైతు భరోసా తొలి విడత నిధుల విడుదల

## 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ

శిల్పకళా వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వర్చువల్ విధానంలో సమావేశానికి హాజరయ్యారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా నిధుల విడుదల రైతులకు పండుగ లాంటిదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు (మిగతా 4వ పేజీలో)




## తెలంగాణలో భారీ AI-డేటా సెంటర్ పెట్టుబడులకు సీఎం ఆహ్వానం

### భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌తో రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్, జూన్ 30

తెలంగాణలో డేటా సెంటర్లు, కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతీ ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భర్తీ మిట్టల్ ను ఆహ్వానించారు. ప్రభుత్వ విద్యా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ పెట్టుబడులపై ఇరువురి మధ్య విస్తృతంగా చర్చ జరిగింది. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్‌లో బుధవారం జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఖ. రామకృష్ణ రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి (మిగతా 4వ పేజీలో)



## 'ఓజీ 2'లో పూజా హెగ్డే?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు మరో భారీ అవకాశం దక్కనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా తెలుగు చిత్రాల్లో అవకాశాలు తగ్గిన పూజా హెగ్డే, ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశాన్ని అందుకోనున్నారనే వార్తలు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారాయి.

## భారత సైన్యానికి కొత్త అధిపతి

- జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ
- జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ
- నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం 2



## ముఖ్యమంత్రిని కలిసిన నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, జూన్ 30

తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీ సంజయ్ జాజు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలోని బోధి పెవిలియన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి సలహాదారుగా మరియు సీఎం ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన కే.రామకృష్ణ రావు కూడా పాల్గొన్నారు. ఈ భేటీలో రాష్ట్ర పరిపాలన, బాధ్యతల బదిలీ తదితర అంశాలపై స్వల్పంగా చర్చ జరిగినట్లు సమాచారం.





## అధ్యక్షుడు ట్రంప్‌కు ఎదురుదెబ్బ

### పుట్టుకతో పౌరసత్వం ఇచ్చుడే!

### స్పష్టం చేసిన అమెరికా సుప్రీంకోర్టు

### ట్రంప్ ప్రతీకార సుంకాలు సైతం రద్దు

జన్మతః పౌరసత్వ హక్కు రద్దు విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమె రికా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బర్త్ రైట్ సిటిజన్‌షిప్‌ను రద్దుచేస్తూ వెలువరించిన కార్యనిర్వహాక ఉత్తర్వులను ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. జన్మతః పౌరసత్వ హక్కు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో చట్టాన్ని రద్దుచేయడానికి ట్రంప్ చేసిన ప్రయత్నా లకు గండిపడింది.

వాషింగ్టన్: గతేడాది అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తాను చెలాయిస్తున్న విస్తృత అధికారాలకు పరాకాష్టగా ట్రంప్ తీసుకొచ్చిన ప్రతీకార సుకాలను కొన్ని నెలల క్రితమే కోర్టు రద్దు చేసింది. జా తీర్పుతో ట్రంప్ అధికార దాహానికి మరోసారి బ్రేక్ పడినట్లయింది. గత వారం వలసదారులను దేశ బహిష్కరణ నుంచి రక్షణ కల్పించే నిబంధనలను రద్దుచేయడానికి ట్రంప్‌నకు అనుమతించిన తీర్పుతో సహా ఇతర వలస కేసుల్లో న్యాయమూర్తులు అధ్యక్షుడి అధికారాలకే మద్దతు పలికారు. కానీ, తాజా నిర్ణయంలో మాత్రం.. కేవలం ఒక సంతకంతో పుట్టుకతో వచ్చే పౌరసత్వం నిర్వచనాన్ని ట్రంప్ మార్చలేరని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మెజారిటీ న్యాయమూర్తుల అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్.. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లిదండ్రులకు జన్మించిన పిల్లలు కూడా 14వ సవరణలోని పౌరసత్వ నిబంధనకు అర్హులని పేర్కొన్నారు. "అప్పుడు, ఇప్పుడు కూడా పౌరసత్వం అనేది హక్కులను కలిగి ఉండే హక్కు.. మన రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా భాగస్వామ్యం పంచుకోవడం.. 14వ సవరణ రూపకర్తలు ఆ వాగ్దానాన్ని 'ఈ దేశంలో జన్మించిన ప్రతి వ్యక్తికి' విస్తరించారు.



## యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటు

### బోర్డులో చిరంజీవి భార్య.. .. అధికారిక ఉత్తర్వులు జారీ

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నూతన బోర్డును ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం ప్రకారం సరికొత్త పాలక మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్, జూన్ 30: నూతన బోర్డుకు చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డి నియ మితులయ్యారు. బోర్డులో చైర్మన్‌తో పాటు సభ్యు లుగా, ఎక్స్-అఫీషియో సభ్యులుగా మొత్తం 18 మందికి చోటు దక్కింది. సభ్యులుగా ఎన్నికైన వారిలో వినోద్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సురేఖ, చిలపగారి విజయరాజం, విజయేందర్ తుల్లా, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్ల య్య, స్వాతి కాంతమణి, ఎం.రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ తరువాయి 2 వ పేజీలో...

## రేపు కేబినెట్ అత్యవసర భేటీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్ష తన ఈ కీలక సమావేశం జరగబోతోంది.

హైదరాబాద్, జూన్ 30: సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యద ర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువా దంతో సహా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. 'నిల్' రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు, సమావేశం జరిగే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా గట్టి చర్యలు చేపట్టింది.

# నేటి రాశి ఫలాలు

మేషం: అప్పుల నుండి అవసరానికి ధన సహకారం అందుతుంది. పాత ఋణాల నుండి విముక్తి లభిస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారపరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: చుట్టుపక్కల వారితో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

మిధునం: ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో అప్పులతో పాల్గొంటారు. సంతాన విద్యా విషయంలో ఊహించని విషయాలు తెలుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు అతికష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలుంటాయి. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాల్లో సహోద్యోగులతో సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి.

సింహం: ఆర్ధిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహరిస్తారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. వాహన యోగం ఉన్నది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: ముఖ్యమైన విషయాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగమున విలువైన పత్రములు విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. చేపట్టిన పనులు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇతరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. అప్పులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మీనం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ధన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.



# రైతు భరోసా తొలి విడత నిధుల విడుదల



(మొదటి పేజీ తరువాయి)

వేదికల ద్వారా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్ 7, 2023న ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతును ఆత్మగౌరవంతో నిలబెట్టే లక్ష్యంతో వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విమర్శలు చేసిన ముఖ్యమంత్రి, తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు మాత్రమే ఉండగా, 2023 డిసెంబర్ నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, సర్పంచ్‌ల బిల్లులు సహా అనేక రంగాల్లో భారీ బకాయిలు పెట్టిందని, వాటిని తమ ప్రభుత్వం క్రమంగా చెల్లిస్తోందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడంతో పాటు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.





## తెలంగాణలో భారీ AI-డేటా సెంటర్ పెట్టుబడులకు
# సీఎం ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా ఆధునీకరిస్తున్నామని, నిరుద్యోగ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ౠజం) అభివృద్ధి చేస్తూ, పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునీకరిస్తున్నట్లు వివరించారు.

**చందన్‌వెల్లిలో చేపట్టనున్న డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి సూచించారు. అంతేకాకుండా తెలంగాణలో మరింత భారీ స్థాయిలో సమగ్ర డేటా సెంటర్,ౠX మౌలిక సదుపాయాల క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ,ౠX కార్యకలాపాలను మరింత విస్తరించాలని సూచించారు.**

భవిష్యత్ పెట్టుబడులు, పరిశ్రమలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసేందుకు ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.

**దీనికి స్పందించిన సునీల్ భారతి మిట్టల్, భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు ముందుకు వస్తామని తెలిపారు. హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్‌కు రెండో ప్రధాన కేంద్రంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రాష్టంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచడంతో పాటు ఫైబర్ కనెక్టివిటీ విస్తరణకు కూడా సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.**

# భారత సైన్యానికి కొత్త అధిపతి

న్యూఢిల్లీ, జూన్ 30 (మన దీపం) :

భారత సైన్యానికి 31వ సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.పదవీ విర మణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది నుంచి ఆయన బాధ్యతలను అధికారికంగా చేపట్టారు.నాలుగు దశాబ్దాల కు చేరువైన సుదీర్ఘ సైనిక సేవా అనుభవంతో జనరల్ ధీరజ్ సేథ్ భారత సైన్యానికి నాయకత్వం వహించనున్నారు.జనరల్ ఉపేంద్ర ద్వివేది దేశానికి నాలుగు దశాబ్దాల కుపైగా విశిష్ట సేవలు అందించి జూన్ 30న పదవీ విర మణ చేశారు. ఆయన హయాంలో సరిహద్దు భద్రత, సైని క సంస్కరణలు, ఆధునికీకరణ, కార్యాచరణ సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రక్షణ శాఖ పేర్కొం ది.ఆయన సేవలను ఈ సందర్భంగా సైన్యం అభినందిం చింది. కొత్త సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్ తన సైనిక జీవితంలో కార్యాచరణ, వ్యూహాత్మక ప్రణాళిక, సామర్థ్యాల అభివృద్ధి, సంస్థాగత నిర్వహణ వంటి కీలక విభాగాల్లో విస్తృత అనుభవాన్ని సంపాదించారు.భారత సైన్యాన్ని ఆధు నికీకరించడంలో, యుద్ధ సామర్థ్యాలను మరింత బలోపేత ం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు అధికా రులు తెలిపారు.దేశ భద్రతకు అనుగుణంగా మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సైన్యాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దే దిశగా జనరల్ ధీరజ్ సేథ్ నాయకత్వం కీలకం గా మారనుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక సాంకేతికత వినియోగం, వ్యూహాత్మక సామర్థ్యాల పెంపు, సైనిక సంస్కరణలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.సరిహద్దు భద్రతతో పాటు దేశ రక్షణ అవసరా లకు అనుగుణంగా సైన్యాన్ని మరింత బలోపేతం చేయ డం, భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా మార్పులు తీసుకురావడం కొత్త సైన్యాధిపతి ముందున్న ప్రధాన బాధ్యతలుగా భావిస్తున్నారు. దేశ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యమిస్తూ సైన్యం తన విధులను సమర్థంగా కొన సాగించనుంది.జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణతో భారత సైన్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆయన నాయకత్వంలో సైన్యం ఆధునికీకరణ, యుద్ధ సామర్థ్యాల పెంపు, సరిహద్దుల భద్రత, వ్యూహాత్మక సిద్ధత వంటి అంశాల్లో మరింత పురోగతి సాధిస్తుందనే ఆశాభావాన్ని రక్షణ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.






# ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ కొత్త కేంద్రం

**వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు శ్రీకారం**

**కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో ఆమోదం**

**ప్రపంచ కంపెనీలకు ఉత్తమ్ ఆహ్వానం**

హైదరాబాద్, జూన్ 30 (మన దీపం) :

ప్రపంచ ఏరోస్పేస్ సంస్థలు తెలంగాణలో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు.మంత్రి మాట్లాడుతూ వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో పౌర, సైనిక విమానయాన అవసరాలకు అనువుగా కొత్త విమానాశ్రయం అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొత్తగూడెంలో మరో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతు న్నాయని, త్వరలోనే తుది అనుమతి లభించే అవకాశం ఉందని వెల్లడిం చారు. ఈ మూడు విమానాశ్రయాలు రాష్ట్రంలో విమానయాన,పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు.తాను భారత వైమానిక దళంలో యుద్ధ విమాన పైలట్‌గా పనిచేసిన అనుభవంతో ఏరోస్పేస్ రంగం ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకున్నానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అత్యం త కచ్చితత్వం, నాణ్యతకు ఈ రంగంలో అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.తెలంగాణలో ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, జపాన్, ఇజ్రాయెల్, కెనడా వంటి దేశాలకు చెందిన ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టి ప్రపంచ స్థాయి ఉత్పత్తులను తయారు చేస్తున్నాయని వివరించారు.ద

హైదరాబాద్‌లో ఇప్పటికే అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్లు, అపాచీ హెలికా ప్టర్ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమాన రెక్కలు, అత్యాధునిక విమాన ఇంజిన్ భాగాలు తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. స్పెయిన్‌కు చెందిన ఐటీపీ ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడు లు పెట్టడం రాష్ట్రానికి పెరుగుతున్న విశ్వసనీయతకు నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పారిశ్రామిక మండలాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, బలమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ఏడాది ఈ రంగానికి చెందిన ఎగుమతులు 103 శాతం పెరిగి తొలిసారిగా ఔషధ రంగ ఎగుమతులను అధిగమించా యని వెల్లడించారు.యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపు ణ్య సిబ్బందిని ప్రభుత్వం తయారు చేస్తోందని వివరించారు. ప్రప ంచ ఏరోస్పేస్ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తుం దని, ప్రజాప్రతినిధులు నుంచి అధికార యంత్రాంగం వరకు పరి శ్రమలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ పరిశ్రమలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో మరింత కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

శ్వేత

# సంపాదకీయం

బుధవారం 1-7-2026

## మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది.

అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం.

విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.



## తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజు

### సచివాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు

### రిటైరయిన రామకృష్ణారావుకు ఘన వీడ్కోలు

### సీఎం రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, జూన్ 30: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు మంగళవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కే. రామకృష్ణారావు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది నూతన సీఎస్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా, పదవీ విరమణ చేసిన రామకృష్ణారావుకు పూలబోకేలు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు.

**ముఖ్యమంత్రితో భేటీ**

బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంజయ్ జాజు ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఆయన వెంట మాజీ సీఎస్, అలాగే ముఖ్యమంత్రికి నూతన సలహాదారుగా నియమితులైన కే. రామకృష్ణారావు కూడా ఉన్నారు.

**ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ అనుభవం**

1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పని చేసిన విశేష అనుభవం ఉంది. ఆయన గతంలో విజయవాడ సబ్‌కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. 2014 నుంచి కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతున్న ఆయన తాజా నియామకంతో తిరిగి రాష్ట్రానికి వచ్చారు. సంజయ్ జాజు 2029, ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు.

## బెయిల్ కోసం హైకోర్టుకు బండి భగీరథ్!

### రాజకీయ కుట్రతో కేసు పెట్టారని పిటిషన్‌లో వెల్లడి

### నేడు జస్టిస్ కె. సుజన ధర్మాసనం విచారణ

### ఇటీవలే పరీక్షలు రాసి చర్లపల్లి జైలుకెళ్లిన భగీరథ్

హైదరాబాద్, జూన్ 30: మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో పోక్సో కేసులో అరెస్టై, చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. జైలుకు వెళ్లిన 45 రోజుల తర్వాత ఆయన ఈ బెయిల్ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ పిటిషన్‌పై జస్టిస్ కలసికం సుజన ధర్మాసనం నేడు విచారణ చేపట్టనుంది. ఈ కేసులో తాను నిర్దోషినని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై ఈ కేసు బనాయించారని భగీరథ్ తన పిటిషన్‌లో ఆరోపించారు. మొదటి నుంచి పోలీసుల దర్యాప్తుకు తాను పూర్తిగా సహకరించానని న్యాయస్థానానికి విన్నవించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌ను మే 16న అరెస్ట్ చేశారు. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉన్నారు. సాధారణంగా పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో అరెస్టయిన 45 రోజుల తర్వాత నిందితులు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. మే 16 నుంచి జూన్ 30 నాటికి 45 రోజులు పూర్తి కావడంతోనే భగీరథ్ ఈ బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

కాగా, భగీరథ్ తన బీబీఎం బ్యాక్‌లాగ్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఇటీవల కోర్టు అనుమతితో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చారు. జూన్ 20వ తేదీన పరీక్షలకు హాజరైన ఆయన అవి ముగియగానే నిబంధనల ప్రకారం ఈ నెల 25న తిరిగి చర్లపల్లి జైలుకు వెళ్లారు. తాజాగా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు కావడంతో కోర్టు నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.


విదేశాల్లో స్థిరపడాలనే మీ కల...

సరైన మార్గదర్శకత్వంతో నిజం కావచ్చు

నేటి యువతలో విదేశాల్లో స్థిరపడి మెరుగైన ఉద్యోగ అవకాశాలు, ఉన్నత ఆదాయం, ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు పొందాలనే ఆకాంక్ష పెరుగుతోంది. ముఖ్యంగా కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయి. అయితే విదేశీ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో విజయవంతం కావాలంటే సరైన అర్హత, సరైన సమాచారం మరియు నిపుణుల మార్గదర్శకత్వం అత్యంత అవసరం.

కెనడా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాలు అర్హత కలిగిన అభ్యర్థులకు **Permanent Residency (PR)** ద్వారా దీర్ఘకాలిక స్థిర నివాస అవకాశాలను అందిస్తున్నాయి. అదే విధంగా జర్మనీ **Opportunity Card** ద్వారా యూరప్‌లో ఉద్యోగాలను అన్వేషించి, అంతర్జాతీయ కెరీర్‌ను నిర్మించుకునే అవకాశం లభిస్తోంది.

ఇమ్మిగ్రేషన్‌కు దరఖాస్తు చేసే ముందు అభ్యర్థి వయస్సు, విద్య, పని అనుభవం, భాషా నైపుణ్యం **(IELTS/PTE)**, వృత్తి మరియు ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ విధానాలు వంటి అంశాల ఆధారంగా అర్హతను సమగ్రంగా అంచనా వేయడం చాలా ముఖ్యం. సరైన ప్రొఫైల్‌తో ముందుకు వెళితే విజయావకాశాలు మరింత మెరుగుపడతాయి.

**Exxeella Immigration Services** అభ్యర్థుల వ్యక్తిగత ప్రొఫైల్‌ను విశ్లేషించి, వారికి అనువైన ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని సూచిస్తుంది. కెనడా PR, ఆస్ట్రేలియా PR, జర్మనీ **Opportunity Card,** పూర్తి డాక్యుమెంటేషన్ సహాయం మరియు ప్రతి దశలో నిపుణుల మార్గదర్శకత్వంతో అభ్యర్థుల విదేశీ ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది.

విదేశాల్లో స్థిరపడటం అనేది కేవలం ఒక కల మాత్రమే కాదు---సరైన ప్రణాళిక, అర్హత మరియు విశ్వసనీయ మార్గదర్శకత్వంతో అది సాధ్యమయ్యే లక్ష్యం. మీ అర్హతను తెలుసుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం ద్వారా మీ అంతర్జాతీయ భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చు.

"మీ అర్హతే... మీ విదేశీ భవిష్యత్తుకు మొదటి అడుగు"



సంప్రదించండి:
MD. జహాంగీర్
Immigration Adviser
Exxeella Immigration Services
89779 44266
jahangirmd@exxeella.com
www.exxeella.com

# పెన్షనర్లకు త్వరలో పీఆర్సీ, హెల్త్ కార్డులు: పేరి వెంకట్ రెడ్డి



- కోదాడ టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు త్వరలోనే మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయడంతో పాటు అందరికీ ప్రయోజనం చేకూరే విధంగా హెల్త్ కార్డులు అందుబాటులోకి రానున్నాయని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య ఆహ్వానం మేరకు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సామూహిక జన్మదిన వేడుకలు, జిల్లాస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీఆర్సీ, సీపీఎస్ తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అంగీకరించిందని, త్వరలోనే అవి కార్యరూపం దాల్చనున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వాలను మార్చే శక్తి పెన్షనర్ల చేతిలోనే ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కృషి, సహకారంతోనే తాను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని పేర్కొంటూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీతారామయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం సేవా కార్యక్రమాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. అనంతరం జూన్ నెలలో జన్మదినం ఉన్న విశ్రాంత ఉద్యోగులకు సామూహికంగా జన్మదిన వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలైన సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ప్రహ్లాదరావు, ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, దండా మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి పందిరి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మనబోయిన వీరబాబు, ఉపాధ్యక్షులు యస్దాని, బాలేమియా, భ్రమరాంబ, భూపాల్ రెడ్డి, వరకాల జానయ్య, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఖమ్మం జిల్లా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా గుట్టురట్టు.. 65 కేసుల నేరస్థుడు 'బ్రూస్‌లీ' అరెస్ట్

హైదరాబాద్, జూన్ 30

సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్న కరుడుగట్టిన నేరస్థుడితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో బాల నేరస్థుడిని (జువెనైల్) అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూన్ 22న ముషీరాబాద్‌కు చెందిన కూలీ సి. రాజ్‌కుమార్‌ను నిందితులు అపహరించి, దాడి చేసి, అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో పాటు రూ.6,000 నగదును దోచుకున్నారు. అనంతరం ఆలుగడ్డబావి రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో వదిలివేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ముఠా నాయకుడిగా దర్లా నెహెమ్యా అలియాస్ లిలి'బ్రూస్‌లీ' (30)లిలిను గుర్తించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అతనిపై మొత్తం 65 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. గతంలో అతనిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద కూడా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.



## ఈవీ వాహనాలకు ఢిల్లీ ప్రభుత్వ ప్రోత్సాహం

న్యూఢిల్లీ, జూన్ 30

రాజధాని ఢిల్లీలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నియంత్రణతో పాటు ప్రజల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడమే ఈ కొత్త విధానం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ పాలసీ ప్రకారం రూ.30 లక్షల వరకు ధర కలిగిన ఎలక్ట్రిక్ కార్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడంతో పాటు, వాటిపై విధించే రోడ్ టాక్స్‌కు 100 శాతం మినహాయింపు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయంతో ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలు మరింత ఆకర్షణీయంగా మారుతుందని, స్వచ్ఛమైన రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ఈవీ పాలసీ అమలుతో ఢిల్లీలో విద్యుత్ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## యాదాద్రి దేవస్థానానికి కొత్త పాలకమండలి

### చైర్మన్‌గా మన్నే సత్యనారాయణ రెడ్డి.. 18 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు

హైదరాబాద్, జూన్ 30

తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలిని అధికారికంగా ప్రకటించింది. రెవెన్యూ (ఎండోమెంట్స్-1) శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి నెం.392 ప్రకారం పాలకమండలి చైర్మన్‌గా మన్నే సత్యనారాయణ రెడ్డిని నియమించింది. మొత్తం 18 మంది సభ్యులతో పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులకు స్థానం కల్పించారు. ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖతో పాటు పలువురు ప్రముఖులు సభ్యులుగా నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నామినేటెడ్ సభ్యుల పదవీకాలం రెండేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అమల్లో ఉంటుంది. పాలకమండలి చైర్మన్, సభ్యులతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. యాదాద్రి ఆలయ అభివృద్ధి, సమర్థవంతమైన పరిపాలన, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ పాలకమండలి ఏర్పాటు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వులతో కొత్త పాలకమండలి అధికారికంగా అమల్లోకి వచ్చింది.

**యాదాద్రి దేవస్థానం పాలకమండలి సభ్యులు**

**చైర్మన్: మన్నే సత్యనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖ, ఫౌండర్ ట్రస్టీ (పదవీరీత్యా సభ్యుడు), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఎక్స్-అఫిషియో సభ్యుడు), ఎండోమెంట్స్ కమిషనర్ (ఎక్స్-అఫిషియో సభ్యుడు) యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్, యాదాద్రి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో), ఇతర నామినేటెడ్ సభ్యులు కలిపి మొత్తం 18 మంది సభ్యులతో పాలకమండలి ఏర్పాటు చేశారు. కొత్త పాలకమండలి ఆధ్వర్యంలో యాదాద్రి క్షేత్ర అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావడంతో పాటు భక్తులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.**

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు



కోదాడ టౌన్ కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డిని కోరారు. మంగళవారం బీజేపీ సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యుడు జల్లా జనార్దన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎమ్మెల్యేను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జల్లా జనార్దన్ మాట్లాడుతూ, ప్రజాధనంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు అందకపోవడం బాధాకరమన్నారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల లేమితో గృహాలు వినియోగానికి నోచుకోవడం లేదని తెలిపారు. సరైన పర్యవేక్షణ లేకపోతే ఈ గృహాలు శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



## సర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి

### 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలి: ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట, జూన్ 30

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని చురుకుగా పాల్గొనాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. సూర్యాపేట పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష-శివ ఆహ్వానం మేరకు వారు వార్డులో నిర్వహిస్తున్న SIR ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, సూర్యాపేట నియోజకవర్గ ప్రజలందరూ ఓటరు జాబితాను తప్పనిసరిగా పరిశీలించాలని కోరారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు, యువతి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చివ్వేంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అన్నమయ్య రాము, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు స్తంభనం.. వెంటనే పరిష్కరించాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం విజ్ఞప్తి

సూర్యాపేట, జూన్ 30



రాష్ట్రవ్యాప్తంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న సర్వర్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ, సర్వర్ లోపాల కారణంగా రాష్ట్రంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వేలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖలోనే తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సర్వర్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే సూర్యాపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ప్రజలకు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని అన్నారు. వర్షాకాలంలో కార్యాలయానికి వచ్చిన ప్రజలు వర్షంలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేటకు నూతన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ భవనం మంజూరు చేసి, అన్ని మౌలిక వసతులతో నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.



## విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్య యాదవ్

సూర్యాపేట, జూన్ 30

రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సమస్యలతో కుదేలైందని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రశ్నార్థకంగా మారిందని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ ఆరోపించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్, ఫార్మసీ తదితర కళాశాలలను బంద్ నిర్వహించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.8 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.



## పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొండంత భరోసా

### ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

సూర్యాపేట, జూన్ 30

రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాల కోసం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా లభించే ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, సూర్యాపేట అర్బన్, సూర్యాపేట రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఈ పథకాలు ఎంతో భరోసానిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### స్పందించకపోతే ఐదు లక్షల మంది విద్యార్థులతో రాష్ట్రవ్యాప్త ఉద్యమం

### బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి హెచ్చరిక

సూర్యాపేట, జూన్ 30



బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ పిలుపు మేరకు మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన కళాశాలల బంద్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ చారి మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ నుంచి ఉన్నత విద్య వరకు చదువుతున్న అర్హులైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే రూ.8,500 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రభుత్వ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల బంద్‌ను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతం చేయడంతో పాటు ఐదు లక్షల మంది విద్యార్థులతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సాయి తేజ, కల్లూరు అభి, రిషి, జయచంద్ర తదితర బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయంలో ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టిన అన్నదాన సేవ

**కోదాడ టౌన్**

కోదాడ పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమం నాలుగు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ భక్తిశ్రద్ధలతో నిర్వహించింది.



ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదాత దివంగత ఓరుగంటి స్వర్ణలత జ్ఞాపకార్థం ఆమె భర్త ఓరుగంటి కృష్ణమూర్తి, కుమారులు రాజేష్--స్వాతి, భానుప్రకాశ్--మౌనిక, కుమార్తె స్వప్న--ఆనంద్, మరో దాత కె.వి. లక్ష్మారెడ్డి--పద్మ దంపతులతో పాటు పలువురు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి అన్నదాన సేవకు సహకరిస్తున్న దాతలను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. శ్రీ అభయాంజనేయ స్వామి కరుణా కటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులు డి. హనుమంతరావు, వి. కృష్ణమూర్తి, కార్యదర్శి తిరుపతయ్య, శిరీష, బ్యాటరీచారి ఉమామహేశ్వరరావు, పెద్ది శేషు, ఆకుల పుల్లారావు, క్రాంతి, బీఎల్ఎన్ రెడ్డి, బి. సత్యం, వి. రామారావు, కె. రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్, పి. శ్రీనివాసరావు, రామకృష్ణ, పవన్, సతీష్, రంగా, శ్రీను, ప్రకాష్, లక్ష్మారెడ్డి, నరేష్, గాంధీ, వి. రాంప్రసాద్, వెంకటకృష్ణ, విశాల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి మఠాలకు భూకేటాయింపులపై విధానం రూపొందించాలి

**టీటీడీ తరహాలో భూముల కేటాయింపు, అతిథి గృహాల నిర్మాణానికి సీఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 30**

యాదాద్రి ఆలయ పరిధిలోని వివిధ మఠాలకు భూముల కేటాయింపుపై సమగ్ర విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక సూచనలు చేశారు. యాదాద్రిలో మఠాలకు భూముల కేటాయింపులో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి తగిన విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు మార్కెట్ ధరల ప్రకారం భూమిని కేటాయించాలని అధికారులకు ఆదేశించారు. భూముల యాజమాన్య హక్కులు ఆలయానికే కొనసాగాలని, అతిథి గృహాల నిర్మాణానికి దశలవారీగా అనుమతులు ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. అతిథి గృహాల నిర్మాణాన్ని కూడా తిరుమల నమూనాలో చేపట్టాలని సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. యాదాద్రిని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, యాదాద్రి జిల్లా అధికారులు, దేవస్థానం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డీఆర్‌డీవోకు క్షిపణులు

**వ్యూహాత్మక వ్యవస్థల కొత్త డైరెక్టర్ జనరల్‌గా డా. జగన్నాథ్ నాయక్**

**హైదరాబాద్, జూన్ 30**

రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)లో క్షిపణులు & వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్‌గా ప్రముఖ శాస్త్రవేత్త డా. జగన్నాథ్ నాయక్ నియమితులయ్యారు. ఆయన జూలై 1, 2026 నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (జుజుూూ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న డా. నాయక్, దేశీయ రక్షణ సాంకేతిక రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించారు. ఫైబర్ ఆప్టిక్ గైరోస్కోప్ సాంకేతికత, ఆకాశ్ క్షిపణి మార్గదర్శక వ్యవస్థలు, డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ (Directed Energy Weapons) అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. భారతదేశపు తొలి డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ వ్యవస్థ అభివృద్ధికి నాయకత్వం వహించిన ఆయన, స్వదేశీ రక్షణ సాంకేతికతల పురోగతికి విశేష కృషి చేశారు. లేజర్లు, ఫైబర్ ఆప్టిక్స్, ఇనర్షియల్ నావిగేషన్ సిస్టమ్స్, డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ రంగాల్లో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. డా. నాయక్ దేశీయ, అంతర్జాతీయ శాస్త్రీయ పత్రికలు, సదస్సుల్లో 125కు పైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురించగా, పలు పుస్తకాలు కూడా రచించారు. అంతేకాకుండా 10 మందికి పైగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆర్యభట్ట అవార్డు, నేషనల్ ఏరోనాటికల్ ప్రైజ్, డీఆర్‌డీవో అగ్ని అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ సెల్ఫ్ రిలయన్స్, నినా సక్సేనా ఎక్సలెన్స్ ఇన్ టెక్నాలజీ అవార్డు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా స్వర్ణ జయంతి అవార్డు వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. డా. జగన్నాథ్ నాయక్ నియామకం ద్వారా దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే స్వదేశీ క్షిపణి, వ్యూహాత్మక సాంకేతిక వ్యవస్థల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రూ. కోటి విలువైన 227.18 కిలోల గంజాయి నిర్వీర్యం

**సూర్యాపేట, జూన్ 30**

సూర్యాపేట జిల్లా పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 227.18 కిలోల గంజాయిని మంగళవారం ప్రభుత్వం, న్యాయస్థానాల ఆదేశాల మేరకు పూర్తిగా నిర్వీర్యం చేశారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా అత్యంత జాగ్రత్తలతో నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ (ఐపీఎస్) తెలిపారు. జిల్లాలో నమోదైన 29 కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఈ గంజాయి మార్కెట్ విలువ రూ. కోటి పైమాటే ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుక్కాపూర్ గ్రామంలోని రోమా ఇండస్ట్రీస్ ప్రాంగణంలో సంస్థ యాజమాన్యం, సిబ్బంది సహకారంతో, ప్రభుత్వ సాక్షుల సమక్షంలో అత్యాధునిక విధానంలో గంజాయిని పూర్తిగా దహనం చేసి బూడిద చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, డ్రగ్స్ విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు లేదా డయల్-100, డయల్-112, 1908 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగదారులు, విక్రేతలను గుర్తించి అవసరమైన కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నామని తెలిపారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచి చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డీఎస్పీ రవి, ఏఆర్ డీఎస్పీ నరసింహ, ఎస్సైలు యాకూబ్, జాన్సీరాణి తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## సీసీ కెమెరాలే సాక్ష్యం... గంటల్లోనే బంగారు పుస్తెల తాడు బాధితురాలి చేతికి

**హుజూర్‌నగర్ పోలీసుల చాకచక్యం.. ఆటోలో పోయిన నగను గుర్తించి మహిళకు అప్పగింత**

**హుజూర్‌నగర్, మంగళవారం**

హుజూర్‌నగర్ పట్టణ పోలీసుల సత్వర స్పందన, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ సమర్థ వినియోగంతో ఆటోలో పోగొట్టుకున్న బంగారు పుస్తెల తాడును గంటల వ్యవధిలోనే గుర్తించి బాధితురాలికి సురక్షితంగా అప్పగించారు. పోలీసుల అప్రమత్తత మరోసారి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టింది. వెంకటేశ్వర కాలనీకి చెందిన వైష్ణవి మంగళవారం మధ్యాహ్నం మట్టపల్లి బైపాస్ రోడ్డులోని వి.టి. టెంపుల్ సమీపంలో లోకల్ ఆటో ఎక్కి పాత బస్టాండ్ వద్ద దిగారు. అనంతరం తన మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు ఆటోలోనే జారిపోయినట్లు గుర్తించి ఆందోళన చెందారు. వెంటనే హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఎస్ఐ నరేష్ వెంటనే స్పందించారు. పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి, వైష్ణవి ప్రయాణించిన ఆటోను తక్కువ సమయంలోనే గుర్తించారు. అనంతరం ఆటో డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తనిఖీ చేయగా, ఆటోలో బంగారు పుస్తెల తాడు లభ్యమైంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు పుస్తెల తాడును అన్ని విధాలుగా నిర్ధారించుకుని బాధితురాలు వైష్ణవికి అప్పగించారు. తనకు అత్యంత విలువైన బంగారు నగను వేగంగా గుర్తించి తిరిగి అందించిన హుజూర్‌నగర్ పోలీసుల సేవాభావం, సమయస్ఫూర్తిని వైష్ణవి అభినందించారు. పోలీసు సిబ్బందికి ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు విలువైన వస్తువులు పోయిన సందర్భాల్లో ఆలస్యం చేయకుండా పోలీసులను ఆశ్రయిస్తే సీసీ కెమెరాల సాయంతో వాటిని గుర్తించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పోలీసులు సూచించారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ నరసింహ

**ముందస్తు అనుమతులు లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం.**

**జూలై 31వ తారీఖు వరకు నిబంధనలు వర్తిస్తాయి.**

**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.**

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్.**

**సూర్యాపేట జులై 30**

శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి జూలై ఒకటి వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.



## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

**నకిరేకల్ జూలై 1**

సమాజంలో జ్ఞాన సుగంధాన్ని వెదజల్లే ఉపాధ్యాయ వృ త్తి ఎంతో పవిత్రమైనదని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. మంగళవారం తాటికల్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ బోయినపల్లి రమణ రావు ఉద్యోగ విరమణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కానుగుల చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ బోయినపల్లి రమణారావు మూడున్నర దశాబ్దాలకు పైగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్లు మన్నెం రాధ, పార్వతి, జగతయ్య, చకిలం వేణుగోపాలరావు, రాజేంద్రప్రసాద్, యాదగిరి రావు, ఉదయశ్రీ, ఉపాధ్యాయులు ఉమారాణి, హరికృష్ణ, ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డా. సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భద్రతకు స్పెషల్ పోలీస్ బెటాలియన్లే కీలక కవచం

### డీజీపీ సి.వి. ఆనంద్

**హైదరాబాద్, జూన్ 30**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల విధులు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, వీఐపీ భద్రత, ప్రత్యేక ఆపరేషన్ల నిర్వహణలో స్పెషల్ పోలీస్ బెటాలియన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. ఈ బెటాలియన్లను ఆధునికీకరించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని స్పెషల్ పోలీస్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీజీపీ, పరిపాలన, సాంకేతిక వసతులు, సిబ్బంది సంక్షేమం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఖాళీ పోస్టుల భర్తీని వేగవంతం చేయడం, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడం, వాహనాల సంఖ్యను విస్తరించడం, సిబ్బందికి మెరుగైన నివాస, వైద్య, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో నక్సలిజాన్ని అణచివేయడంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ బెటాలియన్లు కీలక పాత్ర పోషించాయని డీజీపీ గుర్తు చేశారు. నిజామాబాద్, వరంగల్ వంటి నక్సల్ ప్రభావిత జిల్లాల్లో ఎస్పీగా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లో సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచిన స్పెషల్ పోలీస్ సిబ్బంది ధైర్యసాహసాలను ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా నక్సలైట్లు తరచూ పోలీస్ స్టేషన్లపై దాడులు చేసిన కాలంలో వారి సేవలు మరువలేనివని అన్నారు. ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సంభవించిన వరదల సమయంలో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో స్పెషల్ పోలీస్ సిబ్బంది చేసిన సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## యూరియా యాప్ రద్దు చేసి.. సబ్సిడీ ఎరువులను ప్రభుత్వమే పంపిణీ చేయాలి

**మోతె, జూన్ 30**

ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని రద్దు చేసి ఎరువులు, విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీపై నేరుగా పంపిణీ చేయాలని అఖిల భారత రైతుకూలి సంఘం (AIKMS) నాయకులు డిమాండ్ చేశారు. మోతె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం అఖిల భారత రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి కోట మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, మందుల విక్రయాలను కట్టడి చేసి రైతులను మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయడంతో పాటు, సాగు కోసం బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది యూరియా పంపిణీలో యాప్ విధానం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీఆర్‌జీ (VBGR-G) పథకాన్ని ఉపసంహరించుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పొదపంగి ముత్తయ్య, ఉప సర్పంచ్ ఎస్.కె. హైమద్ బావా, ఏఐకేఎంఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్రబోయిన లింగయ్య, గ్రామ కార్యదర్శి నిమ్మల మల్లయ్య, మోత్కూరి వీరాచారి, అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి, కుడిదల లింగయ్య, జె.ఎల్. వెంకన్న, ఆవుల ఎల్లమంచి, బాలాజీ, వేల్పుల లింగయ్య, ఎర్రబోయిన ఎంకన్న, దాసరి వీరన్న, నరసయ్య, అడపు వెంకన్న, ఎర్రబోయిన పుల్లయ్య, నాగరాజు, సౌదయ్య, కొడదల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఆంద్రీవాకు వింబుల్డన్‌లో ఘన ఆరంభం

ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ మీర్రా ఆండ్రీవా వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తన జోరును కొనసాగిస్తూ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో పోలండ్‌కు చెందిన మాగ్డా లినెట్‌పై 7-5, 6-4 సెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది.స్పష్టం చేశాడు. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన 19 ఏళ్ల ఆండ్రీవా ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కీలక పాయింట్లలో స్థిరమైన ప్రదర్శన కనబరుస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చూపించింది.


**లండన్, జూన్ 30**

మొదటి సెట్‌లో తీవ్ర పోరాటం జరిగినప్పటికీ, కీలక గేమ్‌లను తనవైపు తిప్పుకుని సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ మ్యాచ్‌ను 7-5, 6-4తో ముగించింది.ఈ విజయంతో ఆమె రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టగా, అక్కడ ఆమెకు మరింత కఠిన పరీక్ష ఎదురుకానుంది. డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ బార్బొరా క్రెజికోవాతో ఆమె తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఇప్పటినుంచే టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.గతేడాది వింబుల్డన్‌లో ఆండ్రీవా క్వార్టర్ ఫైనల్ వరకు అద్భుతంగా రాణించి, ఆఖరి దశలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.ఆ అనుభవంతో ఈసారి మరింత పటిష్టంగా బరిలోకి దిగిన ఆమె, టైటిల్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌లో తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించిన ఆండ్రీవా, అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన రెండో మహిళా టెన్నిస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. వింబుల్డన్ మాజీ ఛాంపియన్ కొన్చితా మార్టినెజ్ శిక్షణలో రాణిస్తున్న ఆమె, ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్‌లో అత్యంత వేగంగా ఎదుగుతున్న యువ సంచలనంగా నిలుస్తోంది.

## ఉత్తర అమెరికా వేదికగా
# ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ పోరు
### అగ్రస్థానంలో జర్మన్ స్టార్ డెనిజ్ ఉండవ్

**ఉత్తర అమెరికా, జూన్ 30**

ఉత్తర అమెరికా (అమెరికా-కెనడా-మెక్సికో) వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్ 2026 నాకౌట్ దశకు చేరుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ఉత్సాహం తారస్థాయికి చేరింది. ఒక్క చిన్న తప్పిదం కూడా జట్లను టోర్నమెంట్ నుంచి బయటకు నెట్టే పరిస్థితి ఉండటంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఈ కీలక దశలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య విడుదల చేసిన 'ప్లేయర్ పవర్ ర్యాంకింగ్స్' క్రీడా ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాయి. జర్మనీ స్టార్ స్ట్రైకర్ డెనిజ్ ఉండవ్ అగ్రస్థానంలో నిలవడం పెద్ద సంచలనం అయింది. ప్రపంచ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, కిలియన్ ఎంబాపేలను వెనక్కి నెట్టి ఆయన టాప్ ర్యాంక్ సాధించారు.మెస్సీ ఈ టోర్నీలో మూడు మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్ చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. అంతేకాకుండా వరల్డ్‌కప్ చరిత్రలోనే అత్యధికంగా 19 గోల్స్ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ తాజా డేటా ఆధారిత ర్యాంకింగ్ విధానంలో ఆయనకు రెండో స్థానం దక్కింది. ఎంబాపే, వినిసియస్ జూనియర్, ఎర్లింగ్ హాలాండ్ వంటి స్టార్ ఆటగాళ్లు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చినప్పటికీ టాప్ స్థానం చేరుకోలేకపోయారు.ఈ కొత్త పవర్ ర్యాంకింగ్స్‌ను గోల్స్ మాత్రమే కాకుండా ఆటగాడి మొత్తం ప్రదర్శన ఆధారంగా నిర్ణయిస్తున్నారు. అటాకింగ్, క్రియేటివిటీ, డిఫెండింగ్ అనే మూడు విభాగాల్లో ఆటగాళ్లకు మార్కులు ఇచ్చి తుది ర్యాంక్ ప్రకటిస్తున్నారు.పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో మాత్రం ఈ జాబితాలో 79వ స్థానానికి పడిపోవడం ఆయన అభిమానుల్లో నిరాశ కలిగించింది.








# వైభవ్ బ్యాటింగ్‌కు ఇంగ్లండ్ సర్‌ప్రైజ్ అవుతుంది

ఐర్లాండ్ చేతిలో టీమిండియా 0-2 తేడాతో క్లీన్‌స్వీప్ కావడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరాజయం తర్వాత జులై 1 నుంచి ప్రారంభమయ్యే ఇంగ్లండ్ పర్యటనపై భారత జట్టు దృష్టి పెట్టింది. ఈ సిరీస్ నేపథ్యంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై తీవ్ర ఆసక్తి నెలకొంది.ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం ఇవ్వకపోవడంపై ఇప్పటికే విమర్శలు వినిపిస్తుండగా, ఇప్పుడు భారత మాజీ దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

### భారత మాజీ దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్

**న్యూఢిల్లీ, జూన్ 30**

ఇంగ్లండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.గవాస్కర్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ సామర్థ్యం ఇంగ్లండ్ బౌలర్లను ఆశ్చర్యపరుస్తుందని అన్నారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ-సంజు శాంసన్ ఓపెనింగ్ జోడీని మార్చడం కష్టం అయినప్పటికీ, యువ ఆటగాడికి అవకాశం ఇవ్వడం అవసరమని అభిప్రాయపడ్డారు.ఐర్లాండ్ సిరీస్‌లో వైఫల్యం నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టు భారత బ్యాటర్లపై ఇప్పటికే అధ్యయనం చేసి ఉంటుందని, అయితే వైభవ్ గురించి వారికి పెద్దగా సమాచారం లేదని గవాస్కర్ పేర్కొన్నారు. ఐపీఎల్‌లో అతడి ప్రదర్శన మాత్రమే వారికి ఆధారం అని అన్నారు.ఒక్కసారి వైభవ్ జోరందుకుంటే మ్యాచ్ స్వరూపాన్ని ఒంటిచేత్తో మార్చగల సత్తా అతడిలో ఉందని గవాస్కర్ వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం భారత్‌కు అతడి దూకుడు బ్యాటింగ్ అవసరం ఉంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.అదే సమయంలో సీనియర్ ఆటగాళ్ల పాత్రను కూడా గవాస్కర్ ప్రశంసించారు. డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్లు వైభవ్‌కు మార్గదర్శకత్వం అందిస్తున్నారని, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు విలువైన సూచనలు ఇస్తున్నారని తెలిపారు.

యువ ఆటగాళ్లు జట్టులో ఆడకపోయినా, డ్రెస్సింగ్ రూమ్‌లో నేర్చుకునే అనుభవం ఎంతో ముఖ్యమని ఆయన చెప్పారు.వైభవ్‌కు ఇంకా దీర్ఘకాల కెరీర్ ఉందని, సరైన మార్గంలో నడిపితే భారత క్రికెట్‌కు అతడు పెద్ద ఆస్తిగా మారతాడని గవాస్కర్ విశ్వాసం వ్యక్తం చేశారు.



## నెదర్లాండ్స్‌పై మొరాకో
# సంచలనం విజయం

**మాంటెర్రి, జూన్ 30**

ఉత్తర అమెరికా ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్ 2026 నాకౌట్ దశలో మరో భారీ సంచలనం నమోదైంది. మెక్సికోలోని మాంటెర్రి వేదికగా జరిగిన హై-వోల్టేజ్ ప్రి క్వార్టర్స్ పోరులో బలమైన నెదర్లాండ్స్ జట్టుకు ఆఫ్రికన్ జెయింట్ మొరాకో ఊహించని షాక్ ఇచ్చింది. పెనాల్టీ షూటౌట్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో 3-2 తేడాతో మొరాకో అద్భుత విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది.మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు సమానంగా పోరాడాయి. డిఫెన్స్‌లో పటిష్టత, అటాకింగ్‌లో వేగం చూపిస్తూ తొలి అర్ధభాగంలో ఎవ్వరూ గోల్ చేయలేకపోయారు. రెండో అర్ధభాగంలో మ్యాచ్ ఉత్కంఠ మరింత పెరిగింది. 72వ నిమిషంలో నెదర్లాండ్స్ స్టార్ ప్లేయర్ కోడి గాప్కో అద్భుతమైన ఫీల్డ్ గోల్ సాధించి తన జట్టుకు 1-0 ఆధిక్యం అందించాడు. ఆ గోల్‌తో డచ్ జట్టు విజయం దిశగా వెళ్తుందని అంతా భావించిన సమయంలో మ్యాచ్ పూర్తిగా మలుపు తిరిగింది.మ్యాచ్ ఇంజరీ టైమ్‌లో మొరాకో అద్భుతంగా పుంజుకుంది.

# బెన్ స్టోక్స్ సంచలన రిటైర్మెంట్
### : క్రికెట్ ప్రపంచానికి షాక్

**లండన్, జూన్ 30**

న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం కీలక నిర్ణయం ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్




అంతర్జాతీయ క్రికెట్‌కు అకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్ట్ నాలుగో రోజు మ్యాచ్ సందర్భంగా అతడు ఈ నిర్ణయాన్ని వెల్లడించగా, ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో ఓడిపోయి సిరీస్‌ను 1-2తో చేజార్చుకుంది.

స్టోక్స్ రిటైర్మెంట్ నిర్ణయం మ్యాచ్ ఫలితానికంటే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది. 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికిన అతడి నిర్ణయంతో అభిమానులు, మాజీ క్రికెటర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు.ఈ విషయంపై ఇంగ్లండ్ ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ స్పందిస్తూ, స్టోక్స్‌ను నిర్ణయం మార్చుకోవాలని తాను ప్రయత్నించినప్పటికీ అతడు ఇప్పటికే మానసికంగా సిద్ధమై ఉన్నాడని తెలిపారు. "మొదట అతడిని వద్దని ఒప్పించడానికి ప్రయత్నించాను. కానీ అతడి మనసు ప్రశాంతంగా ఉంది, నిర్ణయంపై కట్టుబడి ఉన్నాడు" అని మెక్‌కల్లమ్ చెప్పారు.స్టోక్స్‌తో గడిపిన గత నాలుగేళ్ల ప్రయాణం అద్భుతమని ఆయన గుర్తుచేశారు. "స్టోక్స్ ఒక గొప్ప నాయకుడు. మైదానం లోపలే కాదు, డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా అతడి ప్రభావం చాలా ఉంటుంది. జట్టులో ప్రశాంతతను తీసుకువచ్చే అరుదైన వ్యక్తి" అని ప్రశంసించారు.

అంతర్జాతీయ క్రికెట్‌లో స్టోక్స్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడని, ముఖ్యమైన సందర్భాల్లో మ్యాచ్‌లను ఒంటిచేత్తో మలిచిన అనేక సందర్భాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇకపై కొత్త నాయకత్వంతో ఇంగ్లండ్ క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్తామని మెక్‌కల్లమ్ తెలిపారు.

## డిసెంబరులో ప్రభాస్- బాలయ్య పోటీ?

హైదరాబాద్, జూన్ 30

ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో నవంబర్, డిసెంబర్ నెలలను చిత్రాల విడుదలకు అనుకూల సమయంగా భావించేవారు కాదు. థియేటర్లకు ప్రేక్షకుల రాక తగ్గుతుందనే అభిప్రాయంతో అగ్ర హీరోలు, ప్రముఖ నిర్మాణ సంస్థలు తమ చిత్రాలను ఈ కాలంలో విడుదల చేయడానికి వెనుకంజ వేయేవి. అయితే గత కొన్నేళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిసెంబరులో విడుదలైన పలు భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాలు సాధించడంతో ఇప్పుడు ఈ నెలపైనే దర్శక నిర్మాతల దృష్టి నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబరు తెలుగు సినీ పరిశ్రమలో భారీ బాక్సాఫీస్ పోటీకి వేదిక కానుందనే ప్రచారం సాగుతోంది. ప్రభాస్, బాలకృష్ణ నటిస్తున్న రెండు ప్రతిష్టాత్మక చిత్రాలు వరుస రోజుల వ్యవధిలో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రం యుద్ధ నేపథ్యంతో రూపొందుతోంది. భావోద్వేగాలు, భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ చిత్రం కూడా అదే సమయంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలుత ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా విడుదల చేయాలని భావించినప్పటికీ, చిత్రీకరణ ఆలస్యం కావడంతో విడుదల తేదీని డిసెంబరుకు మార్చినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం డిసెంబరు 4న విడుదల చేసే దిశగా సన్నాహాలు జరుగుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఒక్క రోజు వ్యవధిలోనే ప్రభాస్, బాలకృష్ణ చిత్రాలు విడుదలైతే బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ నెలకొనే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రెండు చిత్రాలకూ భారీ అంచనాలు ఉండటంతో థియేటర్ల కేటాయింపు, తొలి రోజు వసూళ్లు, అభిమానుల సందడి ప్రధాన ఆకర్షణగా మారే అవకాశం ఉంది. అయితే ఈ



## రూ.7 కోట్లతో తీసి రూ.1700 కోట్లు వసూలు చేసిన హారర్ చిత్రం

హైదరాబాద్, జూన్ 30

భారీ బడ్జెట్, అత్యాధునిక దృశ్య ప్రభావాలు లేకపోయినా బలమైన కథ, ఉత్కంఠభరితమైన కథనంతో ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయం సాధించిన హాలీవుడ్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'అబ్సెషన్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ యూట్యూబర్ కర్రీ బార్కర్ దర్శకత్వంలో కేవలం రూ.7 కోట్ల వ్యయంతో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లు సాధించి హారర్ చిత్రాల చరిత్రలో అత్యధిక లాభాలు తెచ్చిపెట్టిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ చిత్రం జూన్ 30 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలైన అమెజాన్ ప్రైమ్ వీడియో, యాపిల్ టీవీ, పీకాక్‌లలో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రాన్ని ఇంగ్లిష్ భాషలో మాత్రమే వీక్షించే అవకాశం ఉంది. కథ విషయానికి వస్తే.. బేర్ అనే యువకుడు తన ప్రియురాలు నిక్కీ ప్రేమను శాశ్వతంగా పొందాలనే ఆశతో ఒక మాయా దండాన్ని విరగగొట్టి కోరిక కోరుతాడు. ప్రపంచంలో అందరికంటే ఎక్కువగా నిక్కీ తననే ప్రేమించాలని అతడు కోరుకుంటాడు. ఆ కోరిక నిజమవుతుంది. అయితే ఆ ప్రేమ క్రమంగా ప్రమాదకరమైన వ్యామోహంగా మారుతుంది. బేర్ ఎప్పుడూ తనతోనే ఉండాలని నిక్కీ పట్టుబడుతుంది. అతడు ఇతరులతో మాట్లాడినా సహించలేక పోతుంది. చివరకు అతని కోసం ఎలాంటి ఘోరాలకు అయినా సిద్ధపడే స్థితికి చేరుతుంది. ప్రేమ, వ్యామోహం, మానసిక ఉద్రిక్తతల మధ్య సాగే ఈ కథ ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠలో ఉంచుతుంది. ఈ చిత్రం భారతదేశంలో కూడా మంచి ఆదరణ పొందింది. కేవలం ప్రేక్షకుల ప్రశంసలతోనే దాదాపు రూ.90 కోట్లకు పైగావసూళ్లు సాధించి సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. థియేటర్లలో ప్రేక్షకులను భయపెట్టిన ఈ హారర్ చిత్రం ఇప్పుడు అన్‌కట్ రూపంలో డిజిటల్ వేదికలపై అందుబాటులోకి రావడంతో మరింత ఆసక్తి నెలకొంది.






## 'రాకా'లో రష్మిక పాత్రపై ఆసక్తి

హైదరాబాద్, జూన్ 30

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల చిత్ర బృందం టైటిల్‌ను అధికారికంగా ప్రకటించిన తర్వాత, ఇప్పుడు హీరోయిన్ రష్మిక మందన్న పోషిస్తున్న పాత్రపై సినీ వర్గాల్లో చర్చ మరింత ఊపందుకుంది. ఈ చిత్రం విజ్ఞాన సాంకేతిక ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతుండగా, రష్మిక ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో రష్మిక రక్తపిశాచి తరహా ప్రతినాయక ఛాయలు ఉన్న పాత్ర లో నటిస్తున్నారనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారంపై చిత్ర బృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రష్మిక పాత్ర గురించి తనకు పూర్తి సమాచారం లేదని చెబుతూనే, ఒకవేళ ప్రచారంలో ఉన్నట్లుగానే ప్రతినాయక ఛాయలున్న పాత్రలో నటిస్తే అది ఆమె సినీ జీవితంలో అతిపెద్ద సవాల్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ప్రేక్షకులు రష్మికను ఎక్కువగా గ్లామరస్, భావోద్వేగ ప్రధాన పాత్రల్లోనే చూశారని, అలాంటి ఇమేజ్‌కు భిన్నంగా కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఈ పాత్ర ద్వారా లభిస్తుందని ఆయన



## ప్రభాస్ పేరు చెప్పగానే ప్రత్యేక గౌరవం

హైదరాబాద్, జూన్ 30

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానాన్ని ప్రతిబింబించే ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. దర్శకుడు పూరి జగన్నాథ్ బ్యాంకాక్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లినప్పుడు, "నేను ప్రభాస్ స్నేహితుడిని" అని చెప్పడంతో అక్కడి సిబ్బంది ఆయనకు ప్రత్యేక గౌరవం ఇచ్చి వీఐపీ తరహా చికిత్స అందించిన విషయాన్ని ప్రభాస్ వెల్లడించారు. ఈ సంఘటనను ఇటీవల విడుదలైన 'బాహుబలి: ది టార్చ్ బేరర్' డాక్యుమెంటరీలో పంచుకున్నారు. 'బాహుబలి' తొలి భాగం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సమయంలో పూరి జగన్నాథ్ స్వల్ప ఇన్ఫెక్షన్ చికిత్స కోసం బ్యాంకాక్‌లోని ఓ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ వేచి ఉన్న సమయంలో ఓ నర్స్ ఆయనను భారతదేశం నుంచి వచ్చారా అని ప్రశ్నించగా, ఆయన అవునని సమాధానమిచ్చారు. వెంటనే ఆమె 'బాహుబలి?' అని అడగడంతో ఆశ్చర్యపోయిన పూరి జగన్నాథ్ తన వద్ద ఉన్న ప్రభాస్‌తో దిగిన వ్యక్తిగత ఫోటో చూపిస్తూ తాను ఆయనకు సన్నిహిత మిత్రుడినని చెప్పారు. ఆ ఫోటోను చూసిన నర్స్ వెంటనే ఆసుపత్రి సిబ్బందికి సమాచారం అందించింది. అనంతరం పూరి జగన్నాథ్‌కు సాధారణ ప్రక్రియను పక్కనపెట్టి నేరుగా ప్రత్యేక గదికి తీసుకెళ్లి చికిత్స అందించినట్లు డాక్యుమెంటరీలో వెల్లడించారు. ఈ అనుభవాన్ని పూరి జగన్నాథ్ వాయిస్ సందేశం రూపంలో ప్రభాస్‌కు పంపగా, ఆ సమయంలో దర్శకుడు రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఉన్న ప్రభాస్ కూడా ఆశ్చర్యానికి గురైనట్లు తెలిపారు. 'బాహుబలి' చిత్రానికి జపాన్‌తో పాటు అనేక దేశాల్లో విశేష ఆదరణ లభించిన సంగతి తెలిసిందే. అయితే థాయ్‌లాండ్‌లోని ఓ సాధారణ ఆసుపత్రి సిబ్బంది కూడా ఆ చిత్రాన్ని గుర్తించి స్పందించడం చిత్రబృందాన్ని ఆనందానికి గురిచేసిందని పేర్కొన్నారు. ఇదే డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి చేసిన వ్యాఖ్యలు 'బాహుబలి' మూడో భాగంపై మరోసారి చర్చకు దారితీశాయి. వారు చేసిన వ్యాఖ్యలను అభిమానులు మూడో భాగానికి సంబంధించిన పరోక్ష సంకేతాలుగా భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్', అలాగే 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం ఆయన తదుపరి చిత్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి.



## 'ఓజీ 2'లో పూజా హెగ్డే..?

హైదరాబాద్, జూన్ 30

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు మరో భారీ అవకాశం దక్కనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా తెలుగు చిత్రాల్లో అవకాశాలు తగ్గిన పూజా హెగ్డే, ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశాన్ని అందుకోనున్నారనే వార్తలు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. తాజా సమాచారం ప్రకారం పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజిత్ కాంబినేషన్‌లో రూపొందనున్న 'ఓజీ 2' చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 'ఓజీ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో ఆమెను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. పవన్ కళ్యాణ్, పూజా హెగ్డే కాంబినేషన్ గతంలోనే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి తొలుత పూజా హెగ్డే పేరే వినిపించింది. అయితే తేదీల సమస్యలు, ఇతర కారణాల వల్ల ఆ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ జంటను వెండితెరపై చూడాలన్న అభిమానుల కోరిక నెరవేరలేదు. ఇప్పుడు 'ఓజీ 2'లో పూజా హెగ్డేకు అవకాశం దక్కితే అది ఆమె సినీ జీవితానికి కీలక మలుపు కావచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వరుస పరాజయాల తర్వాత టాలీవుడ్‌లో ఆమె జోరు తగ్గినప్పటికీ, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం ఆమెకు మరోసారి మంచి గుర్తింపు తీసుకురావచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే 'ఓజీ' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో సీక్వెల్‌కు సంబంధించిన ప్రతి వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై వస్తున్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీసింది. అయితే పూజా హెగ్డే 'ఓజీ 2'లో నటిస్తున్నారన్న వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ వార్తలను ప్రచారంగానే పరిగణించాల్సి ఉంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467